

దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, వేదికపై జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం

# కాంగ్రెస్ పతనానికి నాంది

- బీఆర్ఎస్ పోరాటంతోనే లగచర్ల రైతులు విజయం సాధించారు
- 'తెలంగాణ' భిక్ష కాదు.. కొట్లాడి సాధించుకున్నాం : ఎమ్మెల్సీ కోటిరెడ్డి
- కేసీఆర్ కాళ్లు కడిగి రేవంత్ నెత్తిన పోసుకోవాలి : రాజేందర్‌రెడ్డి
- ప్రభుత్వం చేతగాని తనాన్ని ప్రదర్శిస్తోంది : చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నారాయణ పేట, నవంబర్ 29 : కాంగ్రెస్ పతనానికి దీక్షా దివస్ నాంది అని, ఇదే రోజునే లగచర్లలో రైతుల భూములు తీసుకోబోమని కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు ప్రకటించిందని, ఇది బీఆర్ఎస్ పోరాటం వల్లే సాధ్యమైందని నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి, అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు విఠల్‌రావుఆర్య హాజరయ్యారు. ముందుగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించడంతోపాటు జయశంకర్, తెలంగాణతల్లి చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న వివిధ మండలాలకు చెందిన ఉద్యమకారులను సన్మానించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ 15 ఏండ్ల కిందట నవంబర్ 29న కేసీఆర్ తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. కేంద్రం మెడలు వంచిన రోజునే మనం దీక్షాదివస్‌గా నిర్వహించుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లుగా ఇది ఎవరో భిక్ష ఇచ్చిన తెలంగాణ కాదని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అని.., అందుకే ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని గుర్తించి రెండు సార్లు అధికారం అప్పగించారన్నారు. పదేండ్ల పాటు కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలో నెంబర్‌వన్‌గా నిలిపారన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సాగునీరు, ఉచితకరెంట్, రైతుబంధు, రైతుబీమా, మద్దతు ధర కల్పించి రైతును రాజును చేసేందుకు కృషి చేశారన్నారు. అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో వెయ్యికిపైగా గురుకులాలను ఏర్పాటు చేశారని వివరించారు. కానీ నేడు రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో నిత్యం ఏదో ఒక చోట గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురికావడంతోపాటు 48 మంది విద్యార్థులను ఈ ప్రభుత్వం పొట్టన పెట్టుకున్నదన్నారు. దీంతో ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు అంటేనే బెదిరిపోయే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వయసు, పదవికి తగ్గట్లు మాట్లాడం లేదని, ముందుగా ఆయన భాషను తీరును మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు దీక్షాదివస్ వేదిక కావాలన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించినందుకు అవాస్తవాలను జోడించి ప్రభుత్వం అన్యాయంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, మైనార్టీ కార్పొరేషన్ సభ్యుడు సలీం, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మండలాల అధ్యక్షులు విజయ్‌సాగర్, రాములు, కృష్ణయ్య, సుభాష్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోరాటానికి దిగివచ్చి రాష్ట్రాన్నిచ్చారు : రాజేందర్‌రెడ్డి



సోనియాగాంధీ కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.., కానీ ఆయన కేసీఆర్ కాళ్లు కడిగిన నీళ్లు పోసుకోవాలని, కేసీఆర్ తెలంగాణ సాధించకుంటే ఈ రోజు నీవు ముఖ్యమంత్రి అయ్యేవాడివి కావని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తెలిపారు. చావును సైతం లెక్క చేయకుండా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, విద్యార్థుల బలిదానాలు, కులమతాలకు అతీతంగా ప్రజలు ఉద్యమాలు చేస్తే గత్యంతరం లేని పరిస్థితుల్లో కేంద్రం రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని, వందలాది మంది ఆత్మబలిదానాలకు సోనియాగాంధీయే కారణం అన్నది గుర్తెరగాలన్నారు. తెలంగాణ దేవత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని, ఇదే రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు సోనియాను బలిదేవతగా అభివర్ణించారని, పదవి ఇవ్వగానే తెలంగాణ తల్లి అయ్యిందా అని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని పరిపాలన చేస్తే మీకు, రాష్ట్రానికి గౌరవం దక్కుతుందని, అలా కాదని మూర్ఖంగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## నిర్లక్ష్యం వల్లే పురుగుల అన్నం : చిట్టెం



కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని.., తీరా వాటిని అమలు చేయాలని కోరుతున్న ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు, అరెస్టు చేస్తూ తమ చేతగానితనాన్ని ప్రభుత్వం పదేపదే ప్రదర్శిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పాఠశాలల్లో పురుగుల అన్నం పెడుతున్నారని, మానవత్వంతో బియ్యం తెప్పించి దగ్గరుండి వండించి తినిపించడం నేరమా..? అందుకేనా తనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పింది అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసినంత మాత్రాన భయపడేది లేదన్నారు. చివరికి విద్యార్థులదే తప్పు అన్నట్లుగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. పురుగుల అన్నం రావడానికి కుట్ర జరిగిందని ఆరోపించడం సమంజసం కాదన్నారు. కేసీఆర్ తమకు ఎంతో క్రమశిక్షణ నేర్పించారని, ఎక్కడ ఆపద ఉంటే అక్కడ తాము ఉంటామన్నారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కోసమే పరితపిస్తారని, ఆయనలా పరిపాలించకపోయినా ఫర్వాలేదు కానీ.. ఢిల్లీ పెద్దల ముందు తాకట్టు పెట్టి రాష్ట్ర పరువును దిగజార్చవద్దని సూచించారు. అరెస్టులు, కేసులకు భయపడొద్దని త్వరలో బీఆర్ఎస్ రావడం ఖాయమని, అంతవరకు ఓపికపట్టాలని కోరారు.

# దీక్షా దివస్‌తోనే.. దశ దిశ

- రాష్ట్ర సాధకుడు కేసీఆర్..
- పదేండ్లలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాం
- ప్రతి గ్రామంలో కేసీఆర్‌లు పుట్టుకొస్తారు..
- గాలిమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ
- పథకాలు రద్దు చేసినందుకా సంబురాలు?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర సాధన ఉద్యమంలో నాడు కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్‌తోనే తెలంగాణ ఏర్పాటుకు దశ దిశ నిర్ణయమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ స్ఫూర్తితోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామన్నారు. శుక్రవారం దీక్షాదివస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం 200 ఏండ్లు ఉద్యమం జరిగిందని, ఇందులో 27 ఏండ్లు మహాత్మాగాంధీ పోరాటం చేశారని గుర్తు చేశారు. అదే కోణంలో అరవైఏండ్ల తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ 14 ఏండ్ల పోరాటంతో రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైందని చెప్పారు. దశాబ్దాల తరబడి ఉద్యమం చేసి సాధించుకున్న రాష్ట్రంలో తెలంగాణ వ్యతిరేకులకు స్థానం లేకుండా చేయాలన్నారు. దేశంలో నాడు పంటల సాగులో అగ్రగామిగా ఉన్న పంజాబ్, హర్యాన లాంటి రాష్ట్రాలకు మించి తెలంగాణలో కేసీఆర్ ముందుచూపుతో మొదటిస్థానంలో నిలిపారన్నారు. ఏనాడూ ప్రజలకు కేసీఆర్ ఒట్టిమాటలు చెప్పలేదని, అమలు కాని హామీలు ఇవ్వలేదని ప్రజలందరి మేలు కోసం పరితపించి పనిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్నదని, ఇంతలా దిగజారిన పార్టీని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. ఎటు చూసినా.. ఏ వర్గం వారిని కదిలించినా ప్రజాగ్రహం పెల్లుబికుతున్నదన్నారు. నిత్యం అప్పులు చేశారని చెబుతున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికే రూ.88వేల కోట్ల అప్పు ఉన్న సంగతిని గుర్తు చేసుకోవాలన్నారు. నిత్యం అబద్ధాలతో పాలన సాగిస్తున్నారని, గాలి మాటలతో గారడీ చేస్తూ తప్పుదోవపట్టిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇక ఎన్ని చెప్పినా నమ్మే స్థితిలో లేరన్నారు. గుత్తేదారులైన మంత్రులు బిల్లులు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటివరకు ఆరు శాఖలకు మంత్రులు లేరని, పాలన అధ్వానంగా తయారైందన్నారు.

**ప్రతి గ్రామంలో కేసీఆర్‌లు పుట్టుకొస్తారు..**

గాడితప్పుతున్న కాంగ్రెస్ పాలన నుంచి ప్రజల మనస్సును తప్పించేందుకు ప్రతి రోజూ కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తామంటూ అడ్డగోలు ప్రకటనలు చేస్తున్నదని విమర్శించారు. బట్టకాల్చి మీదవేసి బద్నాం చేస్తూ ఏదో సాకుతో అరెస్టుల పర్వాన్ని ముందుకు తెస్తున్నదన్నారు. అయితే, కేసీఆర్‌లాంటి వ్యక్తిని ముట్టుకుంటే ఒక్కొక్క గ్రామంలో వందలాది కేసీఆర్‌లు పుట్టుకొస్తారని హెచ్చరించారు. రాష్ట్ర సాధనకు ముందు ఇలాంటి అనేక బెదిరింపులు చూశారని, ఈ బుడ్డ బెదిరింపులకు బీఆర్ఎస్‌లోని ఓ చిన్న కార్యకర్త కూడా భయపడరన్నారు. ముందుగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం దీక్షా దివస్, తెలంగాణ ఉద్యమంపై లఘు చిత్రాలను ఎల్ఈడీ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు బీ.లక్ష్మయ్య, వామన్‌గౌడ్, డాక్టర్ ప్రత్యూష, గుంత మౌనిక, సుకేశిని, రమేశ్‌గౌడ్, వాకిటి శ్రీధర్, కురుమూర్తియాదవ్, లక్ష్మారెడ్డి, కృష్ణానాయక్, అశోక్, జాత్రునాయక్, గులాం ఖాదర్, జహంగీర్, సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రోశాలను వెల్లగక్కుతున్న ప్రజలు

పథకాలను రద్దు చేసినందుకేనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంబురాలు నిర్వహిస్తున్నదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతుబంధును పూర్తిగా ఎత్తివేసిందని.., రూ.15వేలు రైతుభరోసా ఇస్తామంటూ మోసం చేసిందన్నారు. ఇదొక్కటే కాదు.. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా, గతంలో అమలైన వాటిని సైతం నిలిపివేయడంతో జనం ఆక్రోశాలను వెల్లగక్కుతున్నారన్నారు. రైతుబంధు లేక బాధల్లో ఉంటే సంబురాలు నిర్వహించుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు కేబినెట్ హోదాలో ఉన్నా.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టారన్నారు. కేవలం పదిశాతం మేర మిగిలిన పనులను పూర్తి చేస్తే ఉమ్మడి జిల్లాలోని 12 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. కాంగ్రెస్‌లో పార్టీ తెలంగాణ ఇవ్వదని రాజీనామా చేసి.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవులు పొందిన జూపల్లి కృష్ణారావు నేడు ఆ కృతజ్ఞతను మరిచి కేసీఆర్ అవినీతి అంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఓడిపోయినా ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలను అనుభవించిన ఆయన అవినీతి గురించి మాట్లాడడంలో అర్థం లేదన్నారు. కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు అందుబాటులో ఉండాలని, వారి యోగక్షేమాల్లో పాలుపంచుకుంటూ విశ్వాసాన్ని చూరగొనాలన్నారు. ప్రజలను మరిచిపోతే మనుగడ ఉండదని, గ్రామాల్లో కలిసి వచ్చే వారిని సమన్వయం చేసుకుంటూ గౌరవంతో మెలగాలన్నారు. ద్రోహం చేస్తూ మన పక్కల ఉండే వారిని గుర్తించి మసలుకోవాలని హితవు పలికారు.



అమరవీరుల స్తూప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి





మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై లక్ష్మారెడ్డి, ఆల, క్యామ మల్లేశ్, తెలంగాణ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# ఏం ఒరగబెట్టారని సంబురాలు

- నాడు గురుకులాల్లో చేరేందుకు.. నేడు వద్దనుకునేందుకు విద్యార్థుల పోటీ
- కేసీఆర్ హయాంలో సన్నబియ్యంతో భోజనం.. నేడు పురుగుల అన్నం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 29 : కేసీఆర్ దీక్ష చేయడం వల్లే కేంద్రం దిగొచ్చి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిందని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తన ఉద్యోగ సహచరులతో కేసీఆర్‌కు అండగా నిలిచామని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనకు చేపట్టిన ఉద్యమంలో కేసీఆర్ తన ప్రాణాలను లెక్క చేయకుండా పోరాటం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు ఆర్అండ్‌బీ చౌరస్తాలో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ క్యామ మల్లేశ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు, అధ్యక్షులు వేర్వేరుగా ఉన్నా మన రాష్ట్రానికి అధ్యక్షుడు, తెలంగాణ తెచ్చిన కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. మిగతా పార్టీల చరిత్ర వేరు, బీఆర్ఎస్ పార్టీ చరిత్ర వేరని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎందరో నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పదేండ్లు అన్ని అనుభవించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ మారారని, అలాంటి నాయకులు, కార్యకర్తలకు దూరంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రూ.4 వేల పింఛన్, రైతుబంధు, రైతుబీమా ఇవ్వకుండా రైతు సంబురాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హాస్టల్‌లో సీట్ల కోసం విద్యార్థులు పోటీపడేవారని, నేడు హాస్టల్ వదిలి వెళ్లేందుకు పోటీపడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో సన్నబియ్యంలో భోజనం వడ్డిస్తే, నేడు పురుగుల అన్నం పెడుతున్నారన్నారు. టిఫిన్ బాక్స్‌లతో విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం బాగుండేది అనే విధంగా ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తున్నారని, కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఇప్పుడు ఎలా ఉందో ఆలోచన చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నాయకుడు కార్యకర్త కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, సుధాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే అభివృద్ధి : మల్లేశ్



కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ప్రత్యేక రాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజే దీక్షాదివస్ అని అన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. 50 ఏండ్లుగా జిల్లా సాగు, తాగునీరుకు ఎంతో గోసపడిందని, తెలంగాణ వచ్చాక బీళ్లన్నీ సాగుభూములుగా మారాయన్నారు. ఐటీ రంగంలో కూడా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దారని ఆయన వివరించారు. కేసీఆర్ దీక్షను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వం అసమర్థతను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## కేసీఆర్ దీక్షతోనే.. : లక్ష్మారెడ్డి



కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రక్తపు మరకలేకుండా తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లలో చేయలేని అభివృద్ధి కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి అందించలేని పరిస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో 200 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే.. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు.

## నంబర్‌వన్‌గా నిలిపారు : ఆల



ఉద్యమ కాలంలోనే కేసీఆర్ అభివృద్ధి గురించి ఆలోచించేవారని, అందువల్లే పదేండ్లలో సాధించిన అభివృద్ధితోనే దేశంలో నెంబర్ వన్ స్థానానికి చేరిందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ఎలా సాధించారు..? ఎంత అభివృద్ధి చేశారు..? అనే దానిపై నిత్యం నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు అందించి ఓట్లడుగుతామని కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం మూడేండ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క పథకం కూడా ప్రజల దరిచేరలేదన్నారు. రైతుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటినీ నీరు గార్చి ఇబ్బందుల పాలుచేసిన కాంగ్రెస్‌పై రైతులు తిరగబడే రోజులొచ్చాయన్నారు.

# తెలంగాణ అంటేనే కేసీఆర్

- భూమి ఆకాశం ఉన్నంత వరకు కేసీఆర్ పేరు ఉంటుంది..
- పదవులు అనుభవించి ద్రోహం చేసినోళ్లను దరిచేరనివ్వం
- పదవిని అప్రతిష్ట పాలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్
- దీక్షాదివస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి విజయసింహారెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 29 : ఓటుకు నోటు కేసు వ్యవహారంలో నిందితుడిగా తేలిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడని, అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం కుర్చీలో కూర్చున్న రేవంత్‌రెడ్డి పదవిని అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరిస్తున్నారని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, దీక్షా దివస్ కార్యక్రమ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలనపై మండిపడ్డారు. అంతకుముందు తెలంగాణ తల్లికి పూల మాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అదేవిధంగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విజయసింహారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దొంగమాటలు చెబుతూ పబ్బంగడుపుతున్నారన్నారు. వారు ప్రవేశపెట్టిన పథకాల అమలులో సీఎం, మంత్రులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారన్నారు. ఎన్నికల ముందు చాలా మంది నాయకులను పార్టీలో చేర్చుకొని మనం మోసపోయామని, వారిని నమ్మినందుకే బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. నాడు పిడికెడు మందితో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించిన కేసీఆర్ వేలు, లక్షల్లో ప్రజలను సమకూర్చి ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని పదేండ్లలో అభివృద్ధి చేస్తే, మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే సత్యానాశనం చేసిందన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి వారితో కలిసి ఉద్యమం నడిపిన కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేంత వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రులు ఎవరైనా తెలంగాణను దోచుకున్న వారేనని, ఒక్క కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యిందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లావాడని, మా గ్రామ వాసి అని ధైర్యంగా చెప్పుకోలేకపోతున్నారంటే ఆయన పాలన ఏ విధంగా ఉందో ప్రజలకు తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న విజయసింహారెడ్డి

**తెలంగాణ వాదాన్ని తాకట్టు పెట్టారు : గువ్వల**

పార్టీలో పనిచేస్తూ గెలుపొందిన తర్వాత ప్రభుత్వం రాలేదన్న ఉద్దేశంతో పదవులకు తెలంగాణ వాదాన్ని కొందరు తాకట్టు పెట్టారని, అలాంటి వారిని ఎప్పటికీ నమ్మవద్దని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. దీక్షా దివస్‌తోనే మన పోరాటాన్ని మరవద్దని, ఈ కార్యక్రమాన్ని నిత్యం గుర్తు చేసుకునేలా ఉంటేనే మన ముందు తరాలు గుర్తు చేసుకుంటాయన్నారు. మభ్యపెట్టే మాటలు చెప్పిన, అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మోసం చేస్తున్న వారికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత మేమిచ్చినం రాష్ట్రం అని మాట్లాడితే ప్రజలు వారి మాటల్ని నేలకేసి కొట్టారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రితో సహా తెలంగాణకు వ్యతిరేకంగా తుపాకులు పట్టుకొని తిరిగినోళ్లు, తెలంగాణ అంటేనే కేసులు బనాయించినోళ్లు నేడు కేసీఆర్ పోరాటాన్ని, పదేండ్ల పాలనను తక్కువ చేసి మాట్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. చరిత్రను ఎవరూ చెరుపలేరని, ప్రజలకు మంచి సేవలు అందించిన వారిని మరువరన్నారు.

**పోరాటానికి పునాది వేసిన రోజు : మర్రి**

నాటి తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధనలో భాగంగా చేపట్టిన పోరాటానికి పునాది వేసిన రోజును దీక్షా దివస్‌గా జరుపుకొంటున్నామని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపుతూ పోరాటంతో రాష్ట్రాన్ని సాధించిన గొప్ప ధీరుడు కేసీఆర్ అని అన్నారు.

**విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు : బీరం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాలు సాధించుకొని ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు.

**కేసీఆర్ తెలంగాణకు మహాశక్తి : జైపాల్‌యాదవ్**

తెలంగాణ రాష్ట్ర సాధనకుడు కేసీఆర్ రాష్ట్రానికి మహాశక్తి అని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఎన్నో కలలు కని బంగారు తెలంగాణగా మార్చుకుందామని రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు అభివృద్ధి చేస్తే పదకొండు నెలల్లోనే అనుభవం లేని వారి చేతుల్లో తెలంగాణ నాశనమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఏ నియోజకవర్గంలోనూ అభివృద్ధి జరగలేదన్నారు.



వేదికపై విజయసింహారెడ్డి, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, నాయకులు


